క్లుప్తంగా

ఆకట్టుకున్న అక్కాచెల్లెళ్ల నృత్య ప్రదర్శన



రవీంద్రభారతిలో నృత్య ప్రదర్శన ఇస్తున్న అనికారెడ్డి, శ్రీకారెడ్డి

మిర్యాలగూడ టౌన్: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో యూకేకు చెందిన ఎస్ఎస్ అకాడమీ వారు ఆదివారం రాత్రి నిర్వహించిన భరతనాట్య ప్రదర్శనలో మిర్యాలగూడ పట్టణానికి చెందిన ప్రముఖ డాక్టర్ దండ శ్రీనివాస్‌రెడ్డి, నందిత దంపతుల కుమార్తెలు దండ అనికారెడ్డి, శ్రీకారెడ్డి పాల్గొన్నారు. వారు ప్రదర్శించిన భరతనాట్యం అక్కడి వారిని ఆకట్టుకుంది. వారిని ఐజీ(పీఅండ్ఎల్) రమేష్‌రెడ్డి, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ డైరెక్టర్ అలుగు వర్షిణి సత్కరించారు. కార్యక్రమంలో నాట్య గురువు శ్రీకాంత్ సుబ్రహ్మణ్యం, బాల్‌రెడ్డి, వీరారెడ్డి, ఉపేందర్, విష్ణు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులను సరిచేయాలి

పెద్దవూర: ఓటరు జాబితాలో తప్పులను పారదర్శకంగా సరిచేయాలని తహసీల్దార్ ఎస్. సరోజ అన్నారు. సోమవారం పెద్దవూర ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బీఎల్ఓలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. మృతిచెందిన వ్యక్తుల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని బీఎల్ఓలకు సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎస్ఓ సాలయ్య, సిబ్బంది శ్రీనివాస్, రవి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలపై పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

కొండమల్లేపల్లి: త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నల్లగొండ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కొండమల్లేపల్లిలోని గౌతమి స్కూల్‌లో విద్యార్థులకు భగవద్గీతలోని శ్లోకాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు పగిడిమర్రి వెంకటేశం భగవద్గీత శ్లోకాల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మేకల శ్రీనివాసులు, చంద్రమౌళి, చక్రధర్, పరమేష్, రంగారెడ్డి, వెంకటమ్మ, కవిత, పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ నయీం తదితరులు పాల్గొన్నారు.

మొదలైన రాఖీ సందడి

- కొనుగోలుదారులతో కళకళలాడుతున్న దుకాణాలు

హాలియా: పట్టణంలో రాఖీ పండుగ సందడి అప్పుడే మొదలైంది. హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో వివిధ డిజైన్లతో ఉన్న రాఖీలను అమ్ముతున్నారు. ఒక్కో రాఖీ రూ.10 నుంచి రూ.500 వరకు ఉన్నాయి. వెండి, ప్లాస్టిక్ రాఖీలతో పాటు చిన్న పిల్లలను ఆకర్షించేలా వివిధ డిజైన్లతోరాఖీలు మార్కెట్‌లోకి వచ్చాయి. ఇతర ప్రాంతాల్లో ఉండే తమ సోదరులకు రాఖీలు పంపేలా ప్రత్యేక కిట్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఈ కిట్‌లలో రెండు రాఖీలు, కుంకుమ, పసుపు, అక్షింతలు, చాక్లెట్, జీడిపప్పులు ఉంటాయి. వెండి మంగళహారతి ప్లేట్ కూడా ఉంది. ఈ కిట్ ధర రూ.300 నుంచి రూ.1000 వరకు ఉంది. వినియోగదారులను ఆకర్షించేలా హైదరాబాద్, బెంగళూరు, మహారాష్ట్ర, పూణె, రాజస్తాన్ నుంచి రాఖీలను తెప్పిస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. హాలియా పట్టణంలోని మార్కెట్ ఏరియాలో రాఖీలు విక్రయించేందుకు గాను ప్రతి ఏడాది ప్రత్యేకంగా దుకాణాలు వెలుస్తున్నాయి.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

మిర్యాలగూడ టౌన్: పట్టణంలో మంగళవారం నిర్వహించనున్న ప్రజా యుద్ధనౌక గద్దర్, సియాసత్ పత్రిక ఎడిటర్ జహీర్‌అలీఖాన్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి మిర్యాలగూడ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అభ్యుదయ వాదులు, మేధావులు, విద్యార్థులు, యువజన, మహిళా, ఉద్యోగ, ఉపాధ్యాయ, కళాకారుల సంఘాల ప్రతినిధులు భాగస్వాములు అయ్యారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కస్తూరి ప్రభాకర్, తాళ్లపల్లి రవి, మాలోతు దశరథనాయక్, మారం శ్రీనివాస్, దారం మల్లేష్‌యాదవ్, జ్వాల వెంకటేశ్వర్లు, మారం ముత్తయ్య, మురళీయాదవ్, నాగభూషణం, అరుణ, రామయ్య, ఖాజాహమీదుద్దీన్ తదితరులున్నారు.

భవనం ఇక్కడ.. తరగతులు అక్కడ

- పాత వసతి గృహానికి మరమ్మతులు
- పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోని వైనం

గుర్రంపోడు: మండలంలోని పిట్టలగూడెం గ్రామంలో మరమ్మతులు పూర్తిచేసుకున్న మైనార్టీ గురుకుల పాఠశాల భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. 2017లో గుర్రంపోడు మండలానికి మైనార్టీ గురుకుల పాఠశాల మంజూరు కాగా ఇక్కడ అద్దె భవనం దొరక్క నిడమనూరులో తరగతులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఏ మండలానికి మంజూరైన గురుకులం అక్కడే ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పిట్టలగూడెంలో దశాబ్దం క్రితం విద్యార్థులు లేక మూతబడిన ఎస్సీ బాలుర వసతి గృహానికి మరమ్మతులు చేసి తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. గతేడాది ఈ గురుకుల పాఠశాల ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ కావడంతో ఇంటర్ ప్రథమ సంవత్సరం తరగతులు నిడమనూరులోనే కొనసాగాయి. ఈ ఏడాది ద్వితీయ సంవత్సరం తరగతులు పిట్టలగూడెంలో నిర్వహించేలా



పిట్టలగూడెంలోని మైనార్టీ గురుకుల కళాశాల భవనం

ఇక్కడి ఎస్సీ బాలుర వసతి గృహ భవనానికి మరమ్మతులు పూర్తిచేశారు. వసతి గృహం తలుపులు, కిటికీలు తొలగించి కొత్తవి బిగించారు. విద్యుత్, తాగునీరు తదితర సౌకర్యాలను ప్రభుత్వం మంజూరు చేసిన రూ.12లక్షలతో సమకూర్చారు.

మూడు నెలలు గడిచినా..

విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచినా మైనార్టీ గురుకుల కళాశాలను గుర్రంపోడు మండలానికి తరలించలేదు. సిబ్బంది నియామకం పూర్తయ్యి ఫర్నీచర్, వంట సామగ్రి, ఇతర సామగ్రి వచ్చినా విద్యార్థులు మాత్రం ఇక్కడ లేరు. ప్రిన్సిపాల్‌ను నియమించకపోవడంతో పాటు గుర్రంపోడు మండల కేంద్రంలో కాకుండా పిట్టలగూడెం గ్రామంలో భవనం ఉండడంతో ఇక్కడకు వచ్చేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

వెంటనే ప్రారంభించాలి



మైనార్టీ గురుకుల కళాశాలను గుర్రంపోడులోని పిట్టలగూడేనికి తరలించడంలో నెలల తరబడి ఎందుకు జాప్యం జరుగుతుందో అర్థంకావడం లేదు. ఎప్పుడు అడిగినా ఇక్కడకు వస్తుందని మూడు నెలలుగా చెబుతూనే ఉన్నారు. ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేసి భవనాన్ని వినియోగంలోకి తెచ్చినా ఫలితం లేకపోతుంది. వెంటనే గురుకుల కళాశాలకు ఇక్కడకు తరలించాలి.

– పోలె రాములమ్మ, సర్పంచ్, పిట్టలగూడెం

వర్షాలు కురవాలని వరుణ యాగం

మిర్యాలగూడ: రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని మెయిన్ బజార్‌లో గల శివాలయంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరుణ యాగం నిర్వహించారు. ఈ యాగంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో ప్రాజెక్టుల్లో నీరు చేరలేదని, దీంతో పంటలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు సుభిక్షంగా ఉండాలని వరుణ దేవుడికి కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మిర్యాలగూడ మార్కెట్ కమిటీ చైర్మన్ బైరం బుచ్చయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్,



వరుణ యాగంలో పాల్గొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భోగవెల్లి వెంకటరమణచౌదరి, ఆలయ కమిటీ చైర్మన్ బండారు కుశలయ్య, ముక్కపాటి వెంకటేశ్వర్లు, మాలోతు రవీందర్‌నాయక్, రేపాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు పంపిణీ చేయాలని ధర్నా

మాడుగులపల్లి: రెండో విడత గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించిన లబ్ధిదారులకు వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ యాదవ సంఘం నాయకుల ఆధ్వర్యంలో సోమవారం మాడుగులపల్లి మండల కేంద్రంలో గొల్ల, కురుమలు అద్దంకి– నార్కట్‌పల్లి రహదారిని దిగ్బంధించి ధర్నా చేశారు. జూన్‌లోగా గొర్రెలు పంపిణీ పూర్తి చేస్తామని చెప్పిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అప్పులు తెచ్చి డీడీలు చెల్లించామని, గొర్రెలు ఇవ్వకుంటే నేరుగా నగదు బదిలీ చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.



అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై ధర్నా చేస్తున్న గొల్ల కురుమలు

కార్యక్రమంలో ఊరిబండి శ్రీనివాస్, లొడంగి యాదగిరి, కునుకుంట్ల నాగయ్య, సైదులు, బారి కొండయ్య, యాదగిరి పాల్గొన్నారు.

బస్సులు పెంచాలని వినతి

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి డిపో నుంచి నల్లగొండకు బస్సుల సంఖ్య పెంచాలని కోరుతూ సమాచార హక్కు కార్యకర్తలు సోమవారం డీఎం వెంకటమ్మకు వినతి పత్రం అందజేశారు. నార్కట్‌పల్లి నుంచి నల్లగొండకు సమయానుకూలంగా బస్సులు లేక విద్యార్థులు, చెర్వుగట్టుకు వెళ్లే భక్తులు ఇబ్బందులకు పడుతున్నారన్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అదనపు బస్సు సర్వీసులు నడపాలని కోరారు. కార్యక్రమంలో ఎండీ షబ్బీర్ హుస్సేన్, అద్దంకి శ్రీశైలచారి ఉన్నారు.

బీఆర్ఎస్‌ను పటిష్టపర్చాలి

దేవరకొండ: గ్రామాల్లో బీఆర్ఎస్ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు పాటుపడాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం పెద్దఅడిశర్లపల్లి మండలం వద్దిపట్ల గ్రామానికి చెందిన పలువురు దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు పెద్దఎత్తున బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, వెలుగూరి వల్లపురెడ్డి, అర్వపల్లి నర్సింహ, తోటకూరి పరమేష్, ఎర్ర యాదగిరి, శ్రీను, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని ఎర్రచెరువుతండా, పిల్లిగుండ్లతండా, నెల్లికల్లు, మూలతండా, జాల్‌తండా, గోడుమడక, తిమ్మయ్యపాలెం, చెన్నపాలెం, నాయకునితండా, చింతలపాలెం, జమ్మనకోట, సఫావత్‌తండా, జానారెడ్డి కాలనీలోని పోలింగ్ బూత్‌లను సోమవారం మండల తహసీల్దార్ యాదగిరి, ఎస్ఐ సురేష్‌కుమార్ పరిశీలించారు. ఆయా పోలింగ్ బూత్‌లలో నెలకొన్న సమస్యలను, పోలింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్లను పరిశీలించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతుతూ.. మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను సమస్యాత్మక బూత్‌లుగా గుర్తించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలకు తిరుమలగిరి మండలంలో మొత్తం 44 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వివరించారు.

మిర్యాలగూడలో పోటీకి అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి

మిర్యాలగూడ: కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పనిచేస్తున్న తనకు ఈసారి పార్టీ తరఫున మిర్యాలగూడ నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని టీపీసీసీ కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి కోరారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి 36వేల ఓట్లు సాధించానని అన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధనలో అవిశ్రాంత పోరాటం చేశానన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టీఆర్ఎస్ తరఫున మిర్యాలగూడ ఎమ్మెల్యేగా బరిలో నిలిచానని తెలిపారు. ఆ తర్వాత మారిన రాజకీయ సమీకరణాల్లో భాగంగా కాంగ్రెస్‌లో 2018 ఎన్నికల్లో పార్టీ టికెట్ ఆశించినప్పటికీ అధిష్టానం బీసీ సంఘం జాతీయ నాయకుడు ఆర్. కృష్ణయ్యకు సీటు కేటాయించిందన్నారు. అయినప్పటికీ తాను పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఆర్. కృష్ణయ్య తరఫున ప్రచారం చేశానన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని అధిష్టానం తనకు మిర్యాలగూడ ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అధిష్టానం నిర్ణయం మేరకు అభ్యర్థి ఎవరైనా గెలుపు కోసం అందరం కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. మిర్యాలగూడ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. సమావేశంలో గాయం ఉపేందర్‌రెడ్డి, తమ్మన్న, డి. బాలాజీనాయక్, పెదమాం వీరస్వామి, తలకోల వెంకట్‌రెడ్డి, తలకొప్పుల సైదులు, కంచుకట్ల లింగయ్యయాదవ్, దండా ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



మిర్యాలగూడ అర్బన్: మహాసభల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు



అడవిదేవులపల్లి: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ అర్బన్: హాలియాలో సెప్టెంబర్ 2, 3, 4 తేదీల్లో నిర్వహించే ఎస్ఎఫ్ఐ 44వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ పిలుపునిచ్చారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ మహాసభల్లో విద్యారంగంలో ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని అన్నారు. మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి భారీఎత్తున విద్యార్థులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కుర్ర సైదానాయక్, నాయకులు వదూద్, జగన్, వీరన్న, సంపత్, సమద్, తరుణ్, మనోహర్ తదితరులున్నారు.

అడవిదేవులపల్లిలో..

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర సైదానాయక్ ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రవణ్, చంటి, నాయకులు తరుణ్, శివమణి, రవి, ఆనంద్, వాసు, పవన్ తదితరులున్నారు.

దామరచర్లలో..

మిర్యాలగూడ: దామరచర్ల మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల పోస్టర్‌ను దామరచర్ల మండల ఎస్ఎఫ్ఐ కార్యదర్శి వీరన్ననాయక్ ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగానికి మతోన్మాద భావాలు జొప్పిస్తూ యూనివర్సిటీల్లో అభ్యుదయ భావజాలంపై దాడులు చేస్తుందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు విద్య అందకుండా కుట్రలు పన్నుతుందన్నారు. కార్యక్రమంలో పుట్ట సంపత్‌కుమార్, అంజి, శ్రీను, చంటి, శ్రీహర్షిణి తదితరులు పాల్గొన్నారు.



దామరచర్లలో..

వ్యక్తిగత విమర్శలు చేయడం తగదు

గుర్రంపోడు: తమ కుటుంబం గత అరవై సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉందని, తమపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని గుర్రంపోడు మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్ అన్నారు. సోమవారం గుర్రంపోడు మండల కేంద్రంలోని రహదారి బంగ్లా ఆవరణలో నిర్వహించిన బీఆర్ఎస్ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తనను విమర్శించే వారు తనతో పాటు ప్రస్తుతం గుర్రంపోడు జెడ్పీటీసీగా తన భార్య గాలి సరిత చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని అన్నారు. తాము గతంలో నిర్వహించిన రెండు సమావేశాల్లో నాగార్జునసాగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చాలని కోరామని, అంతేకాని ఎవరిపై ఎలాంటి వ్యక్తిగత విమర్శలు చేయలేదని అన్నారు. తనపై విమర్శలు చేయించే వారిని ఓటు ద్వారా తరిమికొట్టే రోజు దగ్గరలోనే ఉందని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు



మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ రవికుమార్

పాశం గోపాల్‌రెడ్డి, సర్పంచ్ మస్రత్ సయ్యద్ మియా, తిరుగుడు లింగారెడ్డి, రావుల సైదులుగౌడ్, కె. విజయ్, మదార్‌షా, కల్యాణ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రావులపాటి భాస్కర్, బి. శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణప్రసాద్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు బల్గూరి నగేష్ గౌడ్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి



తహసీల్దార్ కృష్ణయ్యకు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నిడమనూరు: మండలంలోని సూరేపల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను వారికి ఇవ్వాలని వార్డు సభ్యుడు కందుకూరి కోటేష్, సీపీఎం నాయకుడు కొండేటి శ్రీను సోమవారం నిడమనూరు తహసీల్దార్ కృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే నంబర్ 201లో పేదలకు ఇళ్ల స్థలాలను ప్రభుత్వం కేటాయించిందని, కానీ ఇప్పటి వరకు వాటిని పేదలకు పంపిణీ చేయలేదన్నారు. నాలుగున్నర ఎకరాలను 80 ప్లాట్లుగా చేసినప్పటికీ హద్దులు చూపించలేదన్నారు. పేదలకు ఇచ్చిన ప్రభుత్వ స్థలాలను శ్మశానవాటికలు, పల్లె పకృతి వనాలకు కేటాయిస్తున్నారని అన్నారు. ఇళ్ల స్థలాలు పంపిణీ చేయకుంటే తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

నూతన కమిటీల ఎన్నిక

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద సోమవారం హనుమాన్ శక్తి జాగరణ సమితి మిర్యాలగూడ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాయపోలు మురళి, పీఠాధిపతి జయరాం ముఖ్య అతిథులుగా హాజరై మిర్యాలగూడ పట్టణ, వివిధ మండలాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. మిర్యాలగూడ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా పతాని కృష్ణ, వరకాల సురేష్, ఉపాధ్యక్షుడిగా దాసరాజు జయరాజ్, సహాయ కార్యదర్శిగా పాగ శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా పగడాల జయరాం, సత్యం, మిర్యాలగూడ మండల అధ్యక్షుడిలుగా కందుల రాజేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అజ్మీర శ్రీహరి, ప్రధాన కార్యదర్శిగా వేముల రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా రమావత్ బాలు, వేములపల్లి మండల అధ్యక్షుడిగా పుట్టల ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా వల్లపుదాసు రమేష్, కోశాధికారిగా మాతంగి సుంజయ్, అడవిదేవులపల్లి మండల అధ్యక్షుడిగా లక్పతి,



నూతన కార్యవర్గాలను ప్రకటిస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి

ఉపాధ్యక్షుడిగా పాతులోతు రంగ, ప్రధాన కార్యదర్శిగా మునీ, కోశాధికారిగా రమేష్, దామరచర్ల మండల అధ్యక్షుడిగా బానోతు నాగేందర్, ఉపాధ్యక్షుడిగా వినాయకుల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా కిషన్‌నాయక్, కార్యదర్శులుగా నాగేశ్వర్‌రావు, సైదాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హిందూ ధర్మాన్ని రక్షించుకోవాలని అన్నారు.హనుమాన్ సేవా సమితి కార్యనిర్వాహక సభ్యులు రమావత్ దస్రు, ముత్యాలు, మాతనాయక్, దశరథ్, రంగా తదితరులున్నారు.

తహసీల్దార్‌కు వినతి

చింతపల్లి: మండలంలోని హరిజనాపురం గ్రామ పరిధిలో 27, 30, 31, 32, 33, 34, 35 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం తహసీల్దార్ శంషొద్దీన్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఆయా సర్వే నంబర్లలో 18 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉండగా గ్రామానికి చెందిన కొంత మంది అక్రమంగా పట్టా చేయించుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అవసరాలకు వినియోగించాల్సిన భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న హరిజనాపురం గ్రామస్తులు

వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సత్యనారాయణ, రామకృష్ణ, వెంకటయ్య, ఇద్దయ్య, నగేశ్ తదితరులున్నారు.

నోట్‌బుక్స్ అందజేత



నోట్‌బుక్స్ అందజేస్తున్న దాత మహేందర్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన తెనాలి మహేందర్‌రెడ్డి అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం నోట్‌బుక్స్, పెన్నులు తదితర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ .. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి, గ్రామస్తులు కాంసాని చంద్రశేఖర్, నగేష్, వెంకన్న, నరేష్, కోటేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

మిర్యాలగూడ టౌన్: మండల తహసీల్దార్ కార్యాలయంలో పనుల కోసం ప్రజలు ఎవరూ కూడా దళారులను ఆశ్రయించొద్దని తహసిల్దార్ హరిబాబు సూచించారు. సోమవారం మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయంలో మీసేవా కేంద్రాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఎవరు దళారులను ఆశ్రయించకుండా నేరుగా మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మీసేవా కేంద్రాల నిర్వాహకులు కూడా నిబంధనల మేరకు దరఖాస్తుల చార్జీలు తీసుకోవాలని, ఎక్కువ డబ్బులు తీసుకోవద్దన్నారు. దళారులు డబ్బులు ఇవ్వమని అడిగితే నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. దళారులు తహసీల్దార్ కార్యాలయంలో కనబడితే కేసుల నమోదు చేస్తామన్నారు. సమావేశంలో ఆర్ఐ బాణావత్ సత్యనారాయణ, మీసేవా కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

దళిత ఐక్య మహాసభ కరపత్రం విడుదల



మిర్యాలగూడలోని అమరవీరుల స్థూపం వద్ద కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలో సెప్టెంబర్ 10న నిర్వహించనున్న దళిత ఐక్య మహాసభ కరపత్రాన్ని తెలంగాణ దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉబ్బపల్లి కాశయ్య సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద విడుదల చేసి మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన 77 ఏళ్లు అవుతున్నప్పటికీ దేశంలోని దళితులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఇంకా వెనుకబడిపోయారని అన్నారు. దళితులందరు ఐక్యంగా ఉంటేనే తమ హక్కులను సాధించుకోగల్గుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వజ్జగిరి అంజయ్య, గిరిజన సంఘం జిల్లా నాయకులు ఇస్లావత్ సైదానాయక్, లింగాల ప్రభాకర్ తదితరులున్నారు.

‘గృహలక్ష్మి’లో దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలి

త్రిపురారం: గృహలక్ష్మి పథకంలో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) మండల అధ్యక్షుడు ఖలీల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం త్రిపురారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో రాజకీయ పార్టీలకతీతంగా గృహలక్ష్మి పథకంలో భాగంగా అర్హులైన దివ్యాంగులను మొదట గుర్తించి వారికి ఇల్లు కట్టుకోవడానికి రూ.3లక్షల ఆర్థిక సాయం ఇవ్వాలన్నారు. దివ్యాంగులకు అన్యాయం జరిగితే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు శేఖర్, కార్యదర్శి నారాయణరెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ ప్రమీలకు వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

వైభవంగా చెన్నకేశ్వరస్వామి కల్యాణోత్సవం



చెన్నకేశ్వరస్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

అడవిదేవులపల్లి: అడవిదేవులపల్లి గ్రామ శివారులో కృష్ణా నది ఒడ్డున గల బౌద్ధమ్మ దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త మున్నలూరి వృశిహరి, కుటుంబ సభ్యులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అనంతరం స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు యడవల్లి రఘురామయ్యశర్మ, ఆనందకృష్ణశర్మ, ఆలయ ఈఓ మృత్యుంజయశాస్త్రి, బండి నాగేశ్వర్‌రావు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

దేవరకొండ: దేవరకొండలో ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఐటీడీఏ) ఏర్పాటు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం దేవరకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికంగా ఐటీడీఏ ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపి గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి గిరిజనులకి రూ.3లక్షల ఆర్థికసాయం అందిచాలని కోరారు. సమావేశంలో రమావత్ పాండునాయక్, సీఐటీయూ నాయకులు నల్ల వెంకటయ్య, నాగటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

మిర్యాలగూడ టౌన్: ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని నల్ల గొండ జిల్లా యాదవ సంఘం కార్యదర్శి చిమట శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని యాదవ సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేట జిల్లాలో యాదవులపై అక్రమ కేసులు పెట్టించి భయపెట్టాలని చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతాయని అన్నారు. జనాభా దామాషా ప్రకారం యాదవులకు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని అన్నారు. కార్యక్రమంలో మురళీయాదవ్, గుండెబోయిన నాగేశ్వర్‌రావు, సత్యనారాయణయాదవ్, సురేష్, జ్వాల వెంకటేశ్వర్లు, లింగయ్య, మారయ్య, జానయ్యయాదవ్ తదితరులున్నారు.